క్లుప్తంగా

జూలై 10న గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు

పట్నంబజారు: అరుణాచలం గిరి ప్రదక్షిణ పురస్కరించుకుని జూలై 10న ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు మంగళవారం తెలిపారు. అరుణాచలంలో జరిగే పౌర్ణమి ప్రదక్షిణకు విశేష ఆదరణ ఉందని, జూలై 10న జరిగే కార్యక్రమానికి 8వ తేదీ రాత్రి గుంటూరు నుంచి బయలుదేరుతుందని చెప్పారు. 9న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపులు చూసుకుని 10వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శనం చేసుకున్న తరువాత సాయంత్రం తిరిగి బస్సు బయల్దేరి 11వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోదలచిన వారు 96164 సర్వీసు నంబరులో చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7382897459కు సంప్రదించాలని కోరారు. టికెటు ధర రూ.2,420 నిర్ణయించినట్లు చెప్పారు.

బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నగరంపాలెం: స్థానిక శ్రీనగర్ ఏడో వీధిలోని బాలసుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో గణపతి పూజ, బాలసుబ్రమణ్యేశ్వరస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక హోమం, పూర్ణాహుతి చేపట్టారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఆర్.సి.హెచ్ 2.0 హాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకు చెందిన డాక్టర్ రాకేష్ శర్మ, నిషాంత్ శర్మ, యూనిసెఫ్‌కు చెందిన అర్జిత్సేన్ గుప్తా శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై 2.0 దరఖాస్తులను ఏవిధంగా చేయాలనే విషయాలను వివరించారు. ఎంసీహెచ్ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కె.వి.ఎన్.ఎస్. అనిల్ కుమార్, డాక్టర్ కే విజయలక్ష్మి, డెప్యూటీ డైరెక్టర్ కె.శివశంకర్ బాబు, యూనిసెఫ్ కన్సల్టెంట్ జి.నాగేంద్ర, పి.వినయ్ కుమార్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఏ శ్రావణ్ బాబు, డాక్టర్ ఈ.అన్నపూర్ణ, డాక్టర్ బి.ఎస్.ఎస్. రోహిణి రత్నశ్రీ, డాక్టర్ బి. లక్ష్మానాయక్, సైమన్ రాజు, కృష్ణ కుమారి, షరీఫ్ పాల్గొన్నారు.

సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురు అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. నందివెలుగు రోడ్డులోని కూర్చున్న గాంధీ బొమ్మ వద్ద ముగ్గురు వ్యక్తులు సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ. 930 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పట్నంబజారు: మహిళ మెడలో నుంచి గొలుసు లాక్కొని పరారైన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళదాస్‌నగర్‌కు చెందిన పరుచూరి వాణి చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. మంగళవారం సాయంత్రం పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఇంటి వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి వాణి మెడలోని గొలుసు లాక్కొని పరారయ్యాడు. సుమారు 32 గ్రాములు ఉంటుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

లక్ష్మీపురం: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కె.వి.పి కాలనీ ప్రాంతంలోని టీచర్స్ కాలనీకి చెందిన పఠాన్ సుభానికి చికెన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. భార్య నలుగురు ఆడ సంతానం ఉన్నారు. ఇద్దరికి వివాహం అయింది. మరో ఇద్దరికి వివాహం కాలేదు. కుమార్తె సోమవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల పరిశీలించగా ఎంతకు జాడ తెలియక పోవడంతో నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాకవి శ్రీశ్రీకి ఘన నివాళి

లక్ష్మీపురం: శ్రీరంగం శ్రీనివాసరావుగా విప్లవ కవిగా ప్రత్యేక గుర్తింపు పొందారని రచయిత బండి జమదగ్ని అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం శ్రీశ్రీ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సాహితీవేత్త ముప్పాళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో శ్రీ శ్రీ చేపట్టని ప్రక్రియ లేదని, కవిత్వాన్ని పాత పరిధులను దాటించి కొత్త పరిధుల్లోకి దూకించారని గుర్తు చేశారు.

లక్ష్మీపురం: స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే మంగళవారం నిర్వహించారు. అవగాహన సంస్థ కార్యాదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత ఇంజినీర్ ఎస్.సదాశివం మాట్లాడారు. కార్యక్రమంలో ఎ.హరి, పీటర్, యిరాం పాల్గొన్నారు.

● అంతా మా ఇష్టం



ప్రభుత్వం మాది.. ఇప్పుడు కాకపోతే ఎప్పుడు చేసుకుంటాం. ఏం చేసిన అధికారులు ఎవరూ పట్టించుకోరనే ధీమా కూటమి నేతల్లో కనిపిస్తోంది. శారదాకాలనీ 20వ లైనులో డ్రెయిన్‌ను ఆక్రమించుకుని ముందు స్థలంలోకి రావాలనే ఉద్దేశంతో తిరిగి తమ సొంత డబ్బులతో డ్రెయిన్ నిర్మించుకుని నగరపాలక సంస్థ నిర్మించిన డ్రెయిన్‌ను పూడ్చే పనిలో పడ్డారు. ఇలా చేయడంపై స్థానికులు ప్రశ్నిస్తే మాకు ఎమ్మెల్యే అండ ఉందని బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం లేకుండా స్థానికులు వాపోతున్నారు. – నెహ్రూనగర్

● ఎక్కడి చెత్త అక్కడే...

నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై ఎక్కడ చూసిన చెత్త దర్శనమిస్తోంది. సకాలంలో చెత్త తరలించకపోవడంతో రోడ్లు మీద కుప్పలు కుప్పలు చెత్త కనిపిస్తోంది. కమిషనర్ పులి శ్రీనివాసులు రోడ్లు మీద చెత్త కనిపించడానికి వీల్లేదని.. చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజారోగ్య అధికారులు స్పందించి రోడ్లపై చెత్తను సకాలంలో తరలించాలని నగరవాసులు కోరుతున్నారు. – నెహ్రూనగర్



● రోడ్లపైనే ఆవులు



నగరపాలక సంస్థ పరిధిలో ఆవులు యథేచ్ఛగా రోడ్లు మీద తిరుగుతున్నాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజారోగ్య విభాగం చూసీచూడనట్లు పోతోంది. గతంలో రోడ్లు మీద తిరిగే ఆవులను వెంగళాయపాలెంలోని బందెల దొడ్డికి తరలించేవారు ప్రస్తుతం ఈ ప్రక్రియ నిలిచిపోయింది. రోడ్లు మీద ఆవులు ఇష్టానుసారంగా తిరగడంతో పాటు కొన్ని ఆవులు వాహనదారులపైకి, ప్రజలపై దూసుకువచ్చి దాడి చేస్తున్నాయి. దీనిపై సీఎంహెచ్ఓ డాక్టర్ అమృతంను వివరణ కోరగా రోడ్డుపై ఆవులు తిరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. – నెహ్రూనగర్

యువతను వేధిస్తున్న తలనొప్పి

- పెరుగుతున్న వ్యాధి బాధితులు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

గుంటూరు మెడికల్: ఉరుకులు పరుగుల జీవితం. రోజులు మారాయి. జీవన విధానం మారింది. టెక్నాలజీ యుగం వచ్చింది. చిన్న పెద్ద తేడా లేదు. సెల్‌ఫోన్ చేతికొచ్చింది. తలనొప్పి నిత్యకృత్యమైంది. తలనొప్పితో రోజువారీ పనులు చేసుకోలేక అల్లాడిపోతున్నారు. జూన్ నెల నేషనల్ మైగ్రేన్ అండ్ హెడ్‌ఏక్ అవగాహన మాసం సందర్భంగా తలనొప్పి, మైగ్రేన్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు సూచనలు

యువతలోనే అధికశాతం...

కళాశాల విద్యార్థులు, 30 ఏళ్లలోపు ఉద్యోగాలు చేస్తున్న వారు అధికంగా మానసిక ఒత్తిడికి గురవుతూ మైగ్రేన్ బారిన పడుతున్నారు. ఉద్యోగాలు, చదువులో పోటీతత్వం ఏర్పడి ర్యాంకులు సాధించేందుకు ఒత్తిడికి గురవ్వటం వలన తలనొప్పి వస్తుంది. నిద్రలేమి, విచ్చలవిడిగా కంప్యూటర్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు వినియోగిస్తూ కంటికి సరిపడా నిద్రపోకుండా ఉండటం వలన వ్యాధి బారిన పడుతున్నారు. జిల్లాలో న్యూరాలజిస్టులు 20 మంది ఉండగా ఒక్కో వైద్యుడి వద్దకు ఐదుగురు బాధితులు తలనొప్పితో చికిత్స కోసం వస్తున్నారు. జనాభాలో



మైగ్రేన్ తొలనొప్పి

ప్రతి ఏడుగురిలో ఒకరు మైగ్రేన్ తలనొప్పితో బాధపడుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

మైగ్రేన్ తలనొప్పికి కారణాలు...

మైగ్రేన్ తలనొప్పి వచ్చిన వారికి ప్రత్యక్ష నరకం కనిపిస్తుంది. మైగ్రేన్ తలనొప్పి(పార్శ్వపు నొప్పి) చాలా వరకు తలకు ఒక పక్క మాత్రమే వస్తుంది. తలలో రక్తనాళాలు ఒత్తిడికి గురై వాయటం వల్ల వస్తుంది. కొన్ని సార్లు తలలో రెండు వైపులా ఈ నొప్పి వస్తుంది. తలలో కొట్టుకుంటున్నట్లుగా, నొప్పి వస్తూపోతూ ఉన్నట్లుగా, తగ్గుతూ... తీవ్రమవుతూ ఉన్నట్లుగా మైగ్రేన్ ఉంటుంది. కొందరికి వాంతులు అవుతాయి. మానసిక ఆందోళన, ఒత్తిడికి గురవ్వటం, అనవసరపు ఆలోచనలు, జరిగిపోయినా విషయాలను తరచుగా ఆలోచించటం వల్ల తలనొప్పి వస్తుంది. ఎండలో ఎక్కువగా తిరిగినా, ప్రయాణాలు ఎక్కువ చేసినా, భోజనం చేయటం ఆలస్యమైనా, అసలు భోజనం చేయక పోయినా, నిద్ర తక్కువైనా, ఎక్కువైనా తలనొప్పి రావొచ్చు. స్త్రీలలో హార్మోన్ల సమస్యలు ఏర్పడినప్పుడు, రుతుక్రమం ముందుగాని, తర్వాత గాని వచ్చే అవకాశం ఉంది. గర్భధారణ సమయంలో, స్త్రీలలో రుతుచక్రం ఆగిపోయినప్పుడు సమస్య తీవ్రతరమవుతుంది. పార్శ్వనొప్పి జన్యుపరమైన సమస్య. వంశంలో ఒకరికి ఉంటే వేరొకరికి వచ్చే అవకాశం ఉంది. మగవాళ్ల కంటే స్త్రీలలో పార్శ్వనొప్పి బాధితులు ఎక్కువ.

వ్యాధి నిర్ధారణ ఇలా...

రక్త పరీక్షలు, బీపీ, ఈఈజీ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారు. మైగ్రేన్‌ను నియంత్రణలో పెట్టడం ద్వారా కొన్నాళ్లకు అదే తగ్గిపోతుంది. నెలకు రెండుసార్లు కంటే ఎక్కువగా తలనొప్పి వస్తున్నా, ఒక్కసారే వచ్చి ఎక్కువసేపు నొప్పి ఉంటున్నా ప్రత్యేక మందులు తీసుకోవాలి.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం



మైగ్రేన్ బాధితులకు గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. వారంలో 150 మంది మైగ్రేన్ బాధితులు చికిత్స పొందుతున్నారు. వీరిలో 40 మంది నూతనంగా మైగ్రేన్ సోకిన వారు. ఆధునిక జీవనశైలి వలన ఎక్కువగా యువతలో మైగ్రేన్ కనిపిస్తుంది. ముందస్తు జాగ్రత్తల ద్వారా మైగ్రేన్ కట్టడి చేయవచ్చు.

– డాక్టర్ ఎస్.వెంకటసుందరాచారీ, న్యూరాలజీ విభాగాధిపతి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

జాగ్రత్తలు పాటించాలి....



మానసిక ఒత్తిడికి గురికాకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. అతిగా ఆలోచనలు చేయవద్దు. తలనొప్పి వచ్చినప్పుడు ప్రశాంత వాతావరణంలో, కాంతి లేనిచోట, నిశబ్దంగా ఉన్న చోట నిద్రపోవాలి. ధ్యానం, యోగా, ప్రాణాయామం చేయాలి. తలనొప్పి వస్తుంటే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఎలాంటి తలనొప్పో నిర్ధారణ చేయించుకుని మందులు వాడాలి.

–డాక్టర్ పి.విజయ, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు, గుంటూరు.

రూ.50లతో విద్యార్థులకు భోజనం ఎలా..!

హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు గోడపత్రిక ఆవిష్కరణ

గుంటూరు మెడికల్: యుక్త వయస్సులో ఉన్న విద్యార్థులకు కేవలం రోజుకు 50 రూపాయలతో ఎటువంటి పౌష్టిక ఆహారాన్ని ఇవ్వగలమని బీపీ మండల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థులు పౌష్టిక ఆహార లోపం వలన అనారోగ్యం పాలవుతూ చదువులపై దృష్టి పెట్టలేరని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం గుంటూరు ఆలా హాస్పిటల్‌లో 'బీసీ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు' గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులను కన్నబిడ్డల్లాగా చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తల్లికి వందనం కార్యక్రమం లాగా హాస్టల్ విద్యార్థులకు కూడా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఓ వెంకట్ యాదవ్, కర్నూలు జిల్లా అధ్యక్షులు జి సురేష్, వెటర్నరీ యూనివర్సిటీ ఇంచార్జ్ జే.ఎజ్రా పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, బీసీ సంఘ నేత నాగేశ్వరరావు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూనగర్: బీసీ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో బీసీ హాస్టల్స్‌లలో విద్యార్థుల ఆకలి కేకలు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు ఉప్పర నాగేశ్వరరావు, ప్రసన్నకుమార్, ఎజ్రా, వెంకట్, అనిల్ పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో బుష్రా ఫాతిమా ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: భారత జాతీయ సంస్కృతి, వారసత్వ సంస్థ (ఇన్‌టాక్) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థిని బుష్రా ఫాతిమా రీజియన్ స్థాయిలో విజేతగా నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం ఆర్టీసీ కాలనీలోని పాఠశాలలో జరిగిన విద్యార్థిని అభినందన సభ నిర్వహించారు. ఇన్‌టాక్ రాష్ట్ర కో–కన్వీనర్ రవి శ్రీనివాస్ మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థినిని సత్కరించిన పాఠశాల యాజమాన్యం రూ.రెండు వేల నగదుతో పాటు ఢిల్లీ నుంచి వచ్చిన కిట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, పాఠశాల డైరెక్టర్ సాయి శ్రీకర్, ప్రిన్సిపాల్ కళ్యాణి, హెచ్ఎం మీనాక్షి పాల్గొన్నారు.



విద్యార్థినిని జ్ఞాపిక అందజేస్తున్న మేకల రవీంద్ర బాబు, రవి శ్రీనివాస్ తదితరులు

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యం కలిగి ఉండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈఓ ఆర్.చంద్రముని పేర్కొన్నారు. మంగళవారం యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో పాత గుంటూరులోని యాదవ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రముని మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునేందుకు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు కృషి చేసేవారే నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటారని అన్నారు. కెరీర్ కౌన్సెలింగ్ శిక్షకుడు సీహెచ్ వెంకట్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్థిరమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించి, జీవితంలో ఎదిగేందుకు అవసరమైన మార్గదర్శకాలపై మనోవిజ్ఞాన నిపుణులు, మోటివేషనల్ స్పీకర్స్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈఓ చంద్రముని

ఎస్ఎఫ్ఐ మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

లక్ష్మీపురం: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) అఖిల భారత మహాసభల పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. స్థానిక సంఘ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ జిల్లాలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహాసభల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంపై విస్తృతమైన చర్య ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చే విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని, ఈ సంఘం స్వాతంత్రం, ప్రజాస్వామ్యం సోషలిజం అనే లక్ష్యాల మీద పనిచేయాలనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందని పేర్కొన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ సమీర్, ఎం.కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు నవిత, సహాయక కార్యదర్శి రూపాస్, జిల్లా కమిటీ సభ్యులు షంషీర్, సౌమ్య, సుభాష్, గుంటూరు నగర ఉపాధ్యక్షులు జాన్, సైదాబీ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పాలస్తీనాకు ప్రభుత్వం అండగా నిలబడాలి

వామపక్ష నాయకుల డిమాండ్

లక్ష్మీపురం: ఇజ్రాయెల్ పైశాచిక దాడుల వలన సర్వం కోల్పోయిన పాలస్తీనా ప్రజలకు భారత ప్రభుత్వం అండగా నిలబడాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు పాత బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి, సీపీఎం నగర కార్యదర్శి, సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ నాయకులు జంగాల అజయ్ కుమార్, కె.నళినీకాంత్, మన్నవ హరి ప్రసాద్ మాట్లాడుతూ ఇజ్రాయెల్ యుద్ధ ఉన్మాదంతో పశ్చిమ ఆసియా దేశాలపై వరసగా దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని కూడా లెక్కచేయకుండా ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజలకు సహాయంగా ప్రపంచ దేశాలు పంపుతున్న ఆహారాన్ని, వైద్య పరికరాలను కూడా అడ్డుకోవడం మానవత్వానికే మాయనిమచ్చ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మౌనాన్ని తీవ్రంగా తప్పుపడుతూ, భారత ప్రభుత్వం చారిత్రాత్మకంగా పాలస్తీనాకు ఇచ్చిన మద్దతును మరచిపోవడం దురదష్టకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఎం.ఎ.చిష్టీ, జి.వెంకట్రావు, టి.శ్రీనివాసరావు, కె.మాల్యాద్రి, వి.రాధాకృష్ణమూర్తి, అరుణ్ కుమార్, బి.ముత్యాలరావు, దండా లక్ష్మీనారాయణ, ఎల్.అరుణ, బి.లక్ష్మణరావు, కె.శ్రీనివాసరావు, జి.రమణ, ఎస్‌కే ఖాశింషహీద్, ఎస్‌కే బాషా, ఎస్‌కే ఖాశిం వలి, ఖాజావలి పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న వామపక్షల నాయకులు

సామాజిక ప్రయోజనమే పరమావధిగా పెనుమాక కవితలు



పుస్తకాన్ని ఆవిష్కరించిన వైద్యులు యశస్వి రమణ, నాగేశ్వరరావు

నగరంపాలెం: ప్రముఖ కథా, నవలా రచయిత పెనుమాక నాగేశ్వరరావు రచించిన కవితా సంపుటి 'మన మౌనమే మన శత్రువు'ను ప్రముఖ కవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ ఆవిష్కరించారు. అమరావతి పబ్లికేషన్స్ (గుంటూరు) ప్రచురించిన ఈ సంపుటి ఆవిష్కరణ సభ మంగళవారం సాయంత్రం బృందావన్‌గార్డెన్స్‌లోని గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రాంగణంలో నిర్వహించారు. సభకు అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డుగ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ప్రసిద్ధ సాహితీవేత్త గోటేటి లలితాశేఖర్ కవితా సంపుటిని సమీక్షించారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడారు. సభలో ప్రముఖ రచయిత డాక్టర్ కోగంటి విజయ్‌బాబు, ప్రముఖ కవులు, సాహిత్యాభిమానులు, పెనుమాక బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

నిబద్ధతతో ఇంటర్న్‌షిప్ చేస్తే బంగారు భవిష్యత్

గుంటూరు ఎడ్యుకేషన్: నిబద్ధతతో కూడిన ఇంటర్న్‌షిప్‌తో బంగారు భవిష్యత్ అందిపుచ్చుకోవచ్చునని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సింగరాజు వెంకట రమణ పేర్కొన్నారు. మంగళవారం అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలకు చెందిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఇటీవల ప్రముఖ సంస్థలు, ఆస్పత్రుల్లో 45 రోజుల ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాలపై విశ్లేషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలను పెంపొందించడంలో ఇంటర్న్‌షిప్ అద్భుతమైన అవకాశమని అన్నారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డాక్టర్ కె.లలిత మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. కళ్యాణి, సహాయాచార్యులు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, ఏ బాజీబాబు, వి. అఖిలాష్, అనిత, రాజేశ్వరిదేవి, వెంకట కళ్యాణ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎస్వీ రమణ, లలిత, చక్రవర్తి, అధ్యాపకులు

హిందూ ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలికి పీహెచ్‌డీ

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఫార్మకాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ పొనుగోటి మౌనిక కేఎల్ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నాగభూషణం మాట్లాడుతూ కేఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గుంటుపల్లి చక్రవర్తి పర్యవేక్షణలో ''ఖెల్లీన్ అండ్ మోరిస్ హైడ్రేట్ డైయూరిటిక్, యాంటీ యురోలిథియాటిక్ సామర్థ్యాన్ని ఇథిలీన్ గ్లైకాల్ ప్రేరిత యురోలిథియాసిస్'' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అభినందించారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీ తారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రత్యూష్, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ దేసు బ్రహ్మ శ్రీనివాసరావు, సహచర అధ్యాపకులు డాక్టర్ పొనుగోటి మౌనికకు అభినందనలు తెలిపారు.



మౌనిక

నకిలీ బంగారం తాకట్టు పెట్టి రూ.7.73 లక్షల మోసం

లక్ష్మీపురం: ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో నకిలీ బంగారం తాకట్టు పెట్టి రూ.7.73 లక్షలు రుణం తీసుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. బ్రాడీపేట రోహిణి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే పరసా సుజన్‌రాజు, 179.7 గ్రాముల నకిలీ బంగారాన్ని అరండల్‌పేట 10/1లోని ఇండెల్ మనీ లిమిటెడ్ ప్రైవేట్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ.7.73 లక్షల నగదు తీసుకున్నాడు. ఏప్రిల్ 5వ తేదీన బ్యాంక్‌కు సంబంధించిన ఆడిట్ నేపథ్యంలో నకిలీ బంగారాన్ని గుర్తించారు. దీంతో బ్యాంక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్యాంక్ ఏరియా మేనేజర్ సాంబశివరావు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై ముగిసిన వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల ఐక్యూఏసీ, క్లస్టర్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై ఐదు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ఈసందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడారు.